సాక్షి
కుమురం భీం
మంగళవారం, 11, జూలై, 2023



ప్రభం'జనం' ఆపుదాం..
జనాభా పెరుగుదలతో సంభవించే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 8లో▸



అద్దెకు యంత్రాలు
వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగం పెరిగింది. రైతులకు మండల సమాఖ్య ఆధ్వర్యంలో తక్కువ ధరకే అద్దెకు ఇస్తున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
31.6 /25.3

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కౌన్సెలింగ్ జాబితా విడుదల

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్ట్, ఒప్పంద ప్రతిపాదికన మెడికల్ ఆఫీసర్ల(బీఏఎంఎస్, బీయూఎంఎస్) నియామకానికి 1:3 నిష్పత్తిలో కౌన్సెలింగ్ జాబితా విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని నోటీస్‌బోర్డుతోపాటు https://asifabad.telangana.gov.in వెబ్‌సైట్‌లో జాబితాను పొందుపర్చినట్లు వెల్లడించారు. ఈ నెల 14న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

రక్తనమూనాలు సేకరించాలి



మాట్లాడుతున్న సుధాకర్‌నాయక్

కెరమెరి(ఆసిఫాబాద్): సికిల్‌సెల్ బాధితులను గుర్తించేందుకు ప్రతీ విద్యార్థి నుంచి రక్త నమూనాలు సేకరించాలని అదనపు డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఎంఎల్‌హెచ్‌పీ, హెచ్‌వీ, సూపర్‌వైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతిరోజూ 50 మంది విద్యార్థుల రక్తనమూనాలు సేకరించాలని ఆదేశించారు. రక్త పరీక్షల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వర్షాకాలంలో వ్యాధుల నివారణకు గ్రామీణ ప్రజలను అప్రమత్తం చేసి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో హెచ్‌ఈవో శ్యాంలాల్, హెచ్‌వీ కరుణేశ్వరి, ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్



దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారులు

బెజ్జూర్(సిర్పూర్): వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసమే విద్యుత్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు కాగజ్‌నగర్ విద్యుత్ అసిస్టెంట్ అకౌంట్ అధికారి తుకారాం అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విద్యుత్ అదాలత్‌లో కౌటాల ఏడీఈ రాజేశ్వర్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. కొంత మంది విద్యుత్ వినియోగదారులకే అక్కడికక్కడే పరిష్కారం చూపారు. వారం రోజుల్లో మిగిలిన దరఖాస్తులు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యుత్ పొదుపుగా వాడుకోవాలని, వినియోగదారులు బిల్లులు సకాలంలో చెల్లిస్తూ సహకరించాలని కోరారు. సమస్య లుంటే ఏఈలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈలు అంజల్ కుమార్, రవీందర్, ఇర్ఫాన్, సబ్ ఇంజినీర్లు అజయ్ మీనా, ప్రశాంత్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



గిఫ్ట్ బాక్స్ అందిస్తున్న ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు

ఆసిఫాబాద్‌రూరల్: టాస్క్ ఆధ్వర్యంలో ట్రైన్ టు ది ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఉపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజనల్ సెంటర్‌లో సోమవారం ఉపాధ్యాయులు నేటి తరం విద్యార్థులతో మమేకమయ్యేలా చేపట్టిన ఉపాధ్యాయ రిఫ్రెష్‌మెంట్ శిక్షణను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఐదు రోజులపాటు శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఎన్‌ఈపీ- 2020 ప్రకారం ఉపాధ్యాయులకు అవసరమైన ప్రాథమిక సాంకేతికత, ఫెసిలిటేషన్ నైపుణ్యాలు, గూగుల్ అప్లికేషన్, ఎంఎస్ ఆఫీస్ వినియోగంపై అవగాహన కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మనుకుమార్, శిక్షకులు సాయికుమార్, బాలు తదితరులు పాల్గొన్నారు.



తెగిన తాత్కాలిక వంతెన



ప్రమాదకరంగా పెద్దవాగు దాటుతున్న ప్రజలు

ఎన్నాళ్లీ గోస..?

- పూర్తికాని పెద్దవాగు వంతెన మరమ్మతులు
- ఇటీవల తెగిన తాత్కాలిక వంతెన
- కాగజ్‌నగర్, దహెగాం మార్గంలో రాకపోకలకు అంతరాయం
- ప్రమాదకరంగా వాగు దాటుతున్న ప్రజలు
- ఐదు రోజుల క్రితం వాగులో గల్లంతై ఒకరు మృతి

దహెగాం(సిర్పూర్): రెండేళ్ల క్రితం పెద్దవాగులో వరద ఉధృతికి కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి వద్ద వంతెన పిల్లర్లు కుంగిన విషయం తెలిసిందే. గత సంవత్సరం కూడా భారీ వరదలు రావడంతో కుంగిన వంతెన స్లాబ్ దహెగాం వైపు కూలింది. రాకపోకలు నిలిచిపోవడంతో నవంబర్‌లో వరద తగ్గిన సమయంలో తాత్కాలిక వంతెన, రోడ్డు నిర్మించారు. ఐదు రోజుల క్రితం వాగులోకి మళ్లీ వరద రావడంతో తాత్కాలిక వంతెన తెగింది. దీంతో ప్రజలకు ప్రయాణ కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. వంతెన కుంగడంతో మొదలైన గోస ఇంకా ఎన్నాళ్లకు తీరుతుందని వారు ప్రశ్నిస్తున్నారు.

ప్రమాదకరంగా వాగు దాటుతున్న ప్రయాణికులు

అందవెల్లి వద్ద పెద్దవాగులో ప్రయాణికుల కోసం నవంబర్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన ఇటీవల వరదలకు కొట్టుకుపోయింది. కాగజ్‌నగర్, దహెగాం మండలాల మధ్య రాకపోకలు సాగించే ప్రజలు ప్రమాదకరమని తెలిసినా మోకాళ్ల లోతు నీటిలో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రవాహం దాటుతున్నారు. కాగజ్‌నగర్ నుంచి తెచ్చుకుంటున్న సామగ్రి, చిన్నపిల్లలను ఎత్తుకుని వాగు దాటుతున్నారు. ఐదు రోజుల క్రితం వాగు దాటుతుండగా దహెగాం మండలం దేవాజీగూడకు చెందిన విడిదినేని మల్లయ్య గల్లంతయ్యాడు. మరుసటి రోజు గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, స్థానికులు ఆయన మృతదేహాన్ని గుర్తించారు.

వంతెనకు మరమ్మతులు..

కాగజ్‌నగర్, దహెగాం మార్గంలో 2003లో అందవెల్లి వంతెన అందుబాటులోకి వచ్చింది. దహెగాం, భీమిని మండలాల ప్రజలు కాగజ్‌నగర్ వెళ్లేందుకు మార్గం సులువైంది. అయితే రెండేళ్ల క్రితం భారీ వరద దెబ్బకు వంతెన కుంగింది. గతేడాది వర్షాకాలంలో మరింత ప్రమాదకర స్థాయికి చేరింది. కుంగిన వంతెన మరమ్మతుల కోసం రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా రెండు వైపులా గోడలు నిర్మించి రాకపోకలు నిలిపివేశారు. ఈ క్రమంలో వంతెన అక్టోబర్‌లో కూలింది. మరమ్మతులు చేపట్టడంలో జాప్యం జరగడంతో అధికారుల అంచనాలు తారుమారయ్యాయి. దీంతో మళ్లీ ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి సమగ్ర వివరాలతో నివేదికలు అందించారు. పిల్లర్లు, స్లాబ్ నిర్మాణం కోసం రూ.15 కోట్ల అంచనా వేసి నివేదించినా.. ప్రభుత్వం రూ.13.50 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం వాగులో కొత్త పిల్లర్లు వేసే పనులు కొనసాగుతున్నాయి.

పెంచికల్‌పేట్ మీదుగా ప్రయాణం

దహెగాం, భీమిని మండలాల ప్రజలు నిత్యం వివిధ అవసరాల కోసం కాగజ్‌నగర్ పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం తాత్కాలిక వంతెన తెగిపోవడంతో గ్రామాల నుంచి ఆటోల్లో అందవెల్లి వాగు వరకు చేరుకుని ప్రమాదకరంగా వాగు దాటుతున్నారు. అవతలి వైపు మళ్లీ ఆటోల్లో ప్రయాణం సాగిస్తున్నారు. కాగజ్‌నగర్ మండలంలోని బోడెపల్లి, జగన్నాథ్‌పూర్ గ్రామాల వారు పది కిలోమీటర్ల దూరంలోని కాగజ్‌నగర్‌కు వెళ్లాలంటే పెంచికల్‌పేట్ మీదుగా 75 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. పెంచికల్‌పేట్ పెద్ద వాగుపై వంతెన పూర్తయినా మట్టితోనే అప్రోచ్ రోడ్డు వేశారు. భారీ వరదలు వస్తే దహెగాం మండలం లగ్గాం శివారులోని చిన్నవంతెన రోడ్డు కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ప్రయాణిస్తున్న ఈ రోడ్డు రెండేళ్ల క్రితం కోతకు గురైంది.



పెంచికల్‌పేట్ పెద్దవాగు వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు పరిస్థితి

వాగు దాటి పోతున్నం



అందవెల్లి పెద్దవాగులో ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు తెగింది. ఇట్యాల గ్రామం నుంచి కాగజ్‌నగర్ కేవలం 12 కిలోమీటర్ల దూరం ఉంది. అవసరాల కోసం నడుములోతు నీళ్లలో నుంచి దాటి కాగజ్‌నగర్ పోతున్నం. బండి మీద పోవాలంటే దహెగాం, పెంచికల్‌పేట్ మీదుగా తిరిగి 65 కిలోమీటర్ల ప్రయాణించాలి. మస్తు ఇబ్బంది అవుతుంది.

– దీకొండ సత్తయ్య, ఇట్యాల

గిరాకీ లేదు



వాగులో తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో ప్రయాణికులు కాగజ్‌నగర్‌కు రాకపోకలు తగ్గించారు. ఆటోలకు గిరాకీ లేదు. రోడ్డు ఉన్నప్పుడు రోజూ ప్రయాణికులను కాగజ్‌నగర్‌కు ఎక్కించుకునిపోయేది. రోజుకు నాలుగైదు వందలు సంపాదించే వాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పెంచికల్‌పేట్ మీదుగా వెళ్తున్నం.

– మహేశ్, ఆటోడ్రైవర్, దహెగాం

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

రెబ్బెన(ఆసిఫాబాద్): పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి మాయ, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓదెలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల వేతనం రూ.2వేలకు పెంచుతున్నట్లు సీఎం ప్రకటించి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదన్నారు. అప్పులు చేసి విద్యార్థులకు భోజనం వండిపెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే కోడిగుడ్లు సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు రాంటెంకి విజయ, మండల కార్యదర్శి దుర్గం పద్మ, తానుబాయి, పోచవ్వ తదితరులు పాల్గొన్నారు.

'సమ్మె ఉధృతం చేస్తాం'



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే సమ్మె ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేశ్ హెచ్చరించారు. జీపీ కార్మికుల సమ్మె సోమవారం ఐదో రోజుకు చేరింది. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ జీవో నంబర్ 60 ప్రకారం రూ.19వేల వేతనం చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు సీఐటీయూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అన్ని వర్గాల వారు సమ్మెకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మట్టరాజు, శ్రీకాంత్, సంతోష్, సుశీల, లింగమూర్తి, కల్యాణ్, భారతి తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రజలను దోచుకుంటున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా సోమవారం కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి వద్ద పెద్దవాగు వంతెనను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందవెల్లి వంతెన కూలి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టలేదన్నారు. బిల్లులు తీసుకుని తాత్కాలిక రోడ్డు వేయిస్తే చిన్నపాటి వర్షాలకే కొట్టుకుపోయిందన్నారు. సుమారు 70 గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాని పేర్కొన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులను ఆంధ్ర కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారని ఆరోపించారు.

పారిశుధ్య కార్మిక వ్యవస్థను ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టే కుట్ర

కాగజ్‌నగర్‌టౌన్: పారిశుధ్య కార్మిక వ్యవస్థను ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టే కుట్ర జరుగుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో మున్సిపాలిటీ కార్మికులను సోమవారం కలిసి మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ పారిశుధ్య కార్మికులను ఎందుకు పర్మినెంట్ చేయలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం కుట్రపూరితంగా పారిశుధ్య కార్మికులందరినీ ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు.



పెద్దవాగు దాటుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఎస్పీఎం యాజమాన్యం నిర్లక్ష్యం

వేలాది మందికి నాణ్యమైన విద్యనందించిన సిర్పూర్ పేపర్ మిల్లు(ఎస్పీఎం) బాలభారతి పాఠశాల ఆధిపత్య పాలకుల నిర్లక్ష్యంతో దీనావస్థలో ఉందని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని బాలభారతి పాఠశాలను సోమవారం పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 1960లో ఏర్పాటైన బాలభారతి పాఠశాలపై ఎస్పీఎం యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఆయా కార్యక్రమాల్లో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, ఉత్తర తెలంగాణ చేరిక కమిటీ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, నాయకులు సిడాం గణపతి, రాంప్రసాద్, నక్క మనోహర్, ప్రవీణ్, షేక్ చాంద్ తదితరులు ఉన్నారు.

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

- జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీల ఆందోళన

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ ఉద్యోగులు ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి నలుపు వస్త్రాలు ధరించి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివేణి మాట్లాడుతూ తొమ్మిదేళ్లయినా కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. 2018లో టీచర్లకు రూ.1500, హెల్పర్లకు రూ.750, మినీ వర్కర్లకు రూ.1,250 కేంద్రం పెంచినా.. కేంద్రం బడ్జెట్‌లో తన వాటాను 45 శాతానికి తగ్గించడంతో రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని చెల్లించడం సాధ్యం కాదని చెబుతున్నాయని పేర్కొన్నారు. స్కీం వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగమణి, వనిత, రాజేశ్వరి, మల్లేశ్వరి, ధనలక్ష్మి, ఉమాదేవి, ముంజం శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత కలెక్టరేట్‌లో ప్రజావాణి షురూ

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ హేమంత్ బోర్కడే
- 'గృహలక్ష్మి' దరఖాస్తుకు పోటెత్తిన మహిళలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టరేట్‌లో ప్రభుత్వ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. జూన్ 30న సీఎం కేసీఆర్ సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించగా, సోమవారం కలెక్టరేట్ నూతన సమావేశ మందిరంలో ఆర్డీవో రాజేశ్వర్‌తో కలిసి కలెక్టర్ హేమంత్ బోర్కడే ప్రజావాణి నిర్వహించారు. గృహలక్ష్మి పథకం కోసం వందలాది మంది మహిళలు కలెక్టరేట్ బాట పట్టారు. గత సోమవారం గృహలక్ష్మి దరఖాస్తులు నేరుగా కలెక్టరేట్‌లో స్వీకరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. అయితే గృహలక్ష్మి పథకం కోసం లబ్ధిదారులు మీసేవ కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

దరఖాస్తుల వెల్లువ..

ఆసరా పింఛన్ మంజూరు చేయాలని రెబ్బెన మండలం ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన కె.మనోహర్ అర్జీ సమర్పించాడు. ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా పాసుపుస్తకంలో తప్పుగా నమోదైన వివరాలను సరిచేయాలని చింతలమానెపల్లి మండల కేంద్రానికి చెందిన బుర్రె అర్జయ్య దరఖాస్తు చేసుకున్నాడు. కౌటాల మండలం పార్డి గ్రామానికి చెందిన జాడె సక్కుబాయి చందారం గ్రామ శివారులో 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి పోడు పట్టాలు పంపిణీ చేయాలని కోరింది. పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులు మంజూరు చేయాలని దహెగాం మండలం చేడ్వాయి జెడ్పీ హైస్కూల్‌లోని కార్మికులు విన్నవించారు. పోడు పట్టాలు పంపిణీ చేయాలని సిర్పూర్(యూ) మండలం శెట్టిహత్నూర్‌కు చెందిన ఆత్రం పద్మ దరఖాస్తు చేసుకుంది. వారసత్వంగా సాగు చేసుకుంటున్న భూమికి తమ పేరుతో పట్టా జారీ చేయాలని దహెగాం మండలం కుంచవెల్లికి చెందిన కుంట శంకరయ్య అర్జీ సమర్పించాడు. పాముకాటుతో కుమారుడు మృతి చెందడంతో అతడి పిల్లల పోషణ తనపై పడిందని, ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందించాలని ఆసిఫాబాద్ మండలం రవీంద్రకాలనీకి చెందిన సిడాం కొండు వేడుకున్నాడు. జిల్లా జైలు వెనుక ఫిష్ పాండ్‌లో చేపలు పెంచుకునేందుకు అవకాశం ఇవ్వాలని జన్కాపూర్‌కు చెందిన నాగరాజు దరఖాస్తు చేసుకున్నాడు. ఏళ్ల సాగు చేసుకుంటున్న భూమికి అటవీహక్కు పత్రాలు జారీ చేయాలని సిర్పూర్(యూ) మండలం కోహినూర్–కెకు చెందిన ఆదివాసీలు అర్జీ సమర్పించారు.



గృహలక్ష్మి పథకం దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే



సమీకృత కలెక్టరేట్ ఆవరణలో రద్దీ

రశీదు ఇవ్వలేదు



గత సోమవారం గృహలక్ష్మి పథకం కోసం కలెక్టరేట్‌లో దరఖాస్తు సమర్పించా. ఇప్పటివరకు రశీదు ఇవ్వలేదు. నిరుపేదనైన నాకు గృహలక్ష్మి పథకం కింద ఆర్థికసాయం అందించాలి.

– ఇప్ప కిష్టబాయి, గోయగాం, కెరమెరి

'డబుల్' ఇల్లు మంజూరు చేయాలి



నిరుపేదనైన మాకు సొంత ఇల్లు లేదు. కూలీ పని చేసుకుని బతుకుతున్నాం. అద్దె ఇంట్లో ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం పేదలకు ఇస్తున్న డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలి.

– ఏముర్ల శారద, జన్కాపూర్, ఆసిఫాబాద్

పోడు పట్టాలివ్వాలి



నాలుగేళ్లుగా పోడు భూమి సాగు చేసుకుంటున్నాం. సర్వే చేసిన అధికారులు గ్రామంలో సగం మందికి పట్టాలిచ్చి మాకు ఇవ్వలేదు. నాతోపాటు గ్రామానికి చెందిన మరో నలుగురు ఆదివాసీ రైతులకు పోడు పట్టాలివ్వాలి.

– తుమ్రం చిన్ను, మంగీ, తిర్యాణి

రేపు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు

కాగజ్‌నగర్‌టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న పాఠశాలలు, ఇంటర్ కళాశాలల బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్‌ఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తుమ్మిడే భీమేశ్ మాట్లాడారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ ఫీజులు దందా కొనసాగుతున్నా ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 12న చేపట్టే విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతిగృహాల్లో తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది కొరత వేధిస్తుందని తెలిపారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు హరిశ్చంద్ర ప్రసాద్, శ్రీకాంత్, జాఫర్, గణేశ్ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న నాయకులు

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు


భూమిలోంచి నాటుసారా తీస్తున్న పోలీసులు

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని నెన్నెల, చిన్నలంబాడి తండా, పెద్దలంబాడితండాల్లోని గుడుంబా స్థావరాలపై ఎస్సై శ్యాంపటేల్ ఆధ్వర్యంలో సోమవారం ఎక్సైజ్ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మామిడి తోటలు, పంటచేలల్లో భూమిలో పాతిపెట్టిన వెయ్యి లీటర్ల బెల్లంపానకం ధ్వసం చేశారు. అనంతరం ఇంటింటా సోదాలు నిర్వహించారు. నాటుసారా తయారు చేసినా విక్రయించినా పీడీయాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, మంచిర్యాల ఎక్సైజ్ సీఐ నరేందర్, బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ దీపక్‌పాండే, చెన్నూర్ ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్ పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత


నిందితులతో పోలీసులు

భీమిని: కన్నెపల్లి మండలంలోని జజ్జరవెల్లిలో సోమవారం గుడుంబా పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. గ్రామానికి చెందిన తాళ్లపల్లి ప్రశాంత్, మంచికట్ల రోజ వద్దనుంచి గుడుంబా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి



మృతి చెందిన గేదెలతో యజమానులు

భీమారం: మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లి శివారులో సోమవారం విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి చెందాయి. భీమారం గ్రామంలోని దారవేణి లింగయ్య, మెండె సాయిలు, కొమ్ము పోశంకు చెందిన గేదెలు సోమవారం మేతకు వెళ్లి పోలంపల్లి పరిధిలోని వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరా చేసే స్తంభానికి తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని బాధితులు ఆరోపిస్తున్నారు. సంఘటన స్థలాన్ని విద్యుత్‌శాఖ సిబ్బంది పరిశీలించారు.

ప్రభంజనం ఆపుదాం..

- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

'దేవుడా ఓ మంచి దేవుడా.. మాకు తిన దానికి తిండినిచ్చావు.. ఇలాగే దేశంలోని తొంభై కోట్ల మందికి ఇవ్వాలి.. ప్రపంచంలోని.. నాకు నంబర్ సరిగ్గా తెలియదు.. ఎంత ఉంటే అంత మందికి ఇలాగే ఇవ్వాలని కోరుకుంటున్నా'.. అని ఓ సినిమాలో హీరో ప్రార్థిస్తాడు. అది హాస్యాన్ని పంచినా మరి నేడు అందరికీ ఆహారం అందించడం, అందరి అవసరాలు తీర్చడం, అందరికీ ఉపాధి కల్పించడం సాధ్యమవుతుందా? అంటే ఆలోచించాల్సిందే. నానాటికి పెరుగుతున్న జనాభా.. తద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు, వారికి ఆయా సమస్యలపై అవగాహన కలిగించేందుకు ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1987లో ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకున్న రోజు జూలై 11. కాబట్టి ఆరోజును 'ప్రపంచ జనాభా దినం'గా ఐక్యరాజ్యసమితి గుర్తించింది.



- తగ్గితేనే నీరా'జనం'...
- మితిమీరితే అనర్థమే...
- వనరుల కొరతకు మూలం...
- రోజురోజుకూ పెరుగుతున్న జనాభా

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	మొత్తం జనాభా	జిల్లా వైశాల్యం (చ.కి.మీ.లు)	జనసాంద్రత (కి.మీ.కు)
నిర్మల్	7,09,418	3,731.35	190
ఆదిలాబాద్	7,08,972	3,971.31	179
మంచిర్యాల	8,07,037	3,908.04	207
కుమురంభీం	5,15,812	4,491.28	115



నిర్మల్ ఖిల్లా: 'ఇంతింతై వటుడింతై' అన్న చందంగా నానాటికీ పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్లుగా ప్రకృతి వనరులు తరిగిపోతున్నా వాటిని పొదుపుగా వాడుకునేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదు. కాబట్టి ప్రకృతి వనరుల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పర్యావరణాన్ని కాపాడుకునేలా చేయాలి. అలాగే.. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలు, నిరక్షరాస్యత, భూమిపై స్థలం సరిపోకపోవడం.. లాంటి సమస్యలను ప్రభుత్వాలు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపర్చాలి. ఈ విషయాలపై వారికి క్షుణ్ణంగా అవగాహన కల్పించి, స్వచ్ఛందంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేలా ప్రోత్సహించాలి. ఈ రకంగా ఎవరికివారు జనాభా నియంత్రణకు పూనుకున్నట్లయితే భారాన్ని కాస్తయినా తగ్గించినవారం అవుతాం.

మితిమీరితే ఏర్పడే సమస్యలు ఇవే

జనాభా పెరుగులతో ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుంది. అడవులు అంతరించిపోతాయి. జనాభాకు అనుగుణంగా అవసరాలు కూడా తీర్చాలి. దీంతో తరాల మధ్య అంతరాలు పెరుగుతాయి. ఆకలికేకలు, ఆరోగ్యం ఇబ్బందులు పెడతాయి. జనాభా పెరుగుదలను అడ్డుకుంటేనే మనుగడ సాధ్యం. లేదంటే సమస్యలే నిత్యం స్వాగతం చెబుతాయి. వనరులు సైతం తరిగిపోతున్నాయి. అవసరాలకు మించి వాడటంతో సమస్యలే ఎదురవుతాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చైనాను దాటేసిన భారత్....

ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ నిలిచింది. చాలా కాలంగా మొదటి స్థానంలో కొనసాగుతున్న చైనాను అధిగమించింది. అయితే ఈ రెండు దేశాల మధ్య అంతరాయం చాలా తక్కువే కావడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేసిన ఐక్యరాజ్య సమితి అంచనా నివేదిక ప్రకారం చైనాలో 142.5 కోట్ల జనాభా ఉంటే భారతదేశంలో ప్రస్తుతం 142.8 కోట్ల జనాభా ఉంది. అంటే చైనా కంటే ఇండియా జనాభా దాదాపు మూడు మిలియన్లు ఎక్కువ. భూభాగం పరంగా చైనా పరిధి విశాలంగా ఉండగా భారతదేశం పరిధి చైనాకంటే తక్కువగా ఉంది.

నియంత్రిస్తేనే మనుగడ



పరిమిత వనరులున్న భారతదేశంలో జనాభాను నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యతను ప్రభుత్వాలే కాదు ప్రజలు స్వీయ ఆచరణలో పెడితే జనాభా పెరుగుదలను నియంత్రించవచ్చు. ప్రస్తుతం ఉన్న పరిమిత వనరులను భావితరాలకు అందించవచ్చు.

– పీజీ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్


సమస్యలు వింటున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. కెరమెరి మండలం రాంపూర్‌కు చెందిన కోట్నాక్ విజయ్ దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని, తమ గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని గుడిహత్నూర్ మండలం న్యూసోమర్‌పేట్ గ్రామస్తులు, దస్తురాబాద్ మండలం మున్యాల్‌కు చెందిన భుక్యా వంశీ తనకు స్వయం ఉపాధికోసం ఆర్థికసాయం అందించాలని, ఆర్‌వోఎఫ్ఆర్ హక్కు పత్రాలు మంజూరు చేయాలని నెన్నెల మండలం దమ్మిరెడ్డి గ్రామస్తులు కోరారు. ఇవేకాకుండా ఇంకా పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందజేశారు. అర్జీలు స్వీకరించిన పీవో సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవిటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పట్టని కాంట్రాక్టర్


సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

- ఆరు రోజులుగా సమ్మెలోకి కాంట్రాక్టు కార్మికులు
- కాంట్రాక్టర్ తీరుపై తల పట్టుకుంటున్న అధికారులు

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియా కేకే ఓసీపీ కాంట్రాక్టర్ తీరుతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. సింగరేణి ఉన్నతాధికారుల ఆదేశాలు సైతం బేఖాతర్ చేస్తున్నా అతనికి ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండడంతో ఏంచేయలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆర్‌వీఆర్ కాంట్రాక్టు సంస్థ ఆధ్వర్యంలో ఓసీపీలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని గత నెల 22, 23, 24 తేదీలలో సమ్మె చేశారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, కేకేఓసీ పీవో రమేశ్‌కుమార్ కార్మికులు, సంస్థ యాజమాన్యంతో చర్చలు జరిపినా ప్రయోజనం లేకుండా పోయింది. వేతనాల పెంపుపై రెండునెలల క్రితం గోదావరిఖనిలో ఈ సంస్థకు చెందిన కార్మికులు సమ్మెకు దిగారు. వారికి మద్దతు తెలిపేందుకు సిద్ధపడగా ఇక్కడి కాంట్రాక్టు సంస్థ బాధ్యులు అక్కడ ఏది ఒప్పందం అయినా ఇక్కడ అమలు చేస్తామని, సమ్మెలోకి దిగవద్దని కోరారు. అక్కడ బేసిక్ వేతనం రూ.20వేలకు పెంచడంతో తమకు కూడా అమలు చేయాలని కోరగా తప్పించుకు తిరుగుతున్నారని కార్మికులు ఆరోపిస్తున్నారు. అధికారులను అడిగితే 24 మస్టర్లు చేసిన వారికి వెయ్యి రూపాయలు, 26 మస్టర్లు చేసిన వారికి మరో ఐదు వందలు ప్రోత్సాహకంగా ఇస్తున్నట్లు చెప్తున్నారన్నారు. బేసిక్‌లో కలిపి ఇస్తే చాలని, ప్రోత్సాహకంగా వద్దనడంతో ఏరియా జీఎం మోహన్‌రెడ్డి, పీవో రమేశ్‌కుమార్ సదరు కాంట్రాక్టు సంస్థ యాజమానితో మాట్లాడి కార్మికులకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ నెల1న సంబంధిత అధికారి రానున్నారని, అతనితో చర్చలు జరిపి సమస్య పరిష్కరిస్తామని, సమ్మె చేసిన మూడురోజుల మస్టర్లు ఇస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించి విధులకు హాజరయ్యారు. ఇప్పటికీ సదరు కాంట్రాక్టు సంస్థ బాధ్యుడు రాకపోవడంతో బుధవారం నుంచి కాంట్రాక్టు కార్మికులు మళ్లీ సమ్మెలోకి దిగారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు


బోల్తా పడిన ఆటో

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని బొప్పారం నర్సరీ వద్ద సోమవారం అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ముగ్గురికి తీవ్రంగా, నలుగురికి స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. మైలారం గ్రామానికి చెందిన ఆటో బెల్లంపల్లి నుంచి మైలారం వైపు వెళ్తుండగా నర్సరీ వద్ద రోడ్డు దిగి ఎక్కే క్రమంలో బోల్తా పడింది. జోగాపూర్‌కు చెందిన నికాడి విమల, మైలారంకు చెందిన కుర్సింగ రాజక్క, డ్రైవర్ దుగుట అన్వేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. మైలారంకు చెందిన బోగారపు రమ్య , గొల్లపల్లికి చెందిన తుమ్మనవేణి తిరుపతి, జోగాపూర్‌కు చెందిన నికాడి లచ్చన్న, రుద్రాపూర్‌కు చెందిన కొట్రంగి అరుణలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రోడ్డుకు ఇరువైపులా మొరం పోయకపోవడంతోనే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డుకు సైడ్ బర్మర్ పోయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆర్కే 6 గనిలో కార్మికునికి గాయాలు

శ్రీరాంపూర్: ఆర్కే 6 గనిలో జరిగిన ప్రమాదంలో గైని రాజేందర్ అనే జనరల్ మజ్దూర్ కార్మికునికి గాయాలయ్యాయి. సేఫ్టీ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న రాజేందర్ సోమవారం జనరల్ షిఫ్ట్ విధులకు హాజరయ్యాడు. గని భూగర్భంలోని 5 సీమ్/25 లెవల్/ 3 డిప్ నార్త్ సైడ్‌లో బ్రాటీస్ క్లాత్(పరదా) కడుతుండగా సమీపంలోనే ఓ రూఫ్‌బోల్టర్ యంత్రం నడుస్తుంది. బోల్టర్‌కు, కంప్రెషర్‌కు మధ్య ఉండే వాక్యూమ్ పైప్ జాయింట్ సడెన్‌గా ఊడిపోయి కార్మికుడి కాలికి బలంగా తాకడంతో తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు వెంటనే గని ఉపరితలానికి తీసుకువచ్చి ఆర్కే 8 డిస్పెన్సరీకి, అక్కడి నుంచి రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎడమకాలు ఫ్యాక్చర్ అయినట్లు గుర్తించి కరీంనగర్‌కు రెఫర్ చేశారు.

పడటం వల్లే గాయాలు: గని మేనేజర్

కార్మికుడు పనిచేసే క్రమంలో కాలుజారీ పడటంతోనే కాలు విరిగిందని ఆర్కే 6 గని మేనేజర్ తిరుపతి తెలిపారు. ప్రమాదంపై విచారణ చేస్తున్నామన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్‌కు చెందిన ఇంగం శ్రీనివాస్ (40) మెడికల్ ఏజెన్సీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఫోన్ కాల్ ఆధారంగా లాడ్జీలోకి వెళ్లి పరిశీలించగా పురుగుల మందు తాగి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య మీన, కుమారుడు మల్లిక్ సాయి ఉన్నారు. కాగా మృతికి గల కారణాలు తెలియరాలేదు.

మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా తిరుమల


నియామకపత్రం అందిస్తున్న నాయకులు

బెల్లంపల్లి: తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా బెల్లంపల్లికి చెందిన మద్దెల తిరుమల నియామకం అయ్యారు. హైదరాబాద్ వేదికగా సోమవారం జరిగిన సంఘం ప్రత్యేక సమావేశంలో తిరుమలను ఎన్నుకున్నారు. మాల సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ చెరుకు రాంచందర్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి నర్సింహయ్య నియామకపత్రం అందజేశారు.

నేడు అభ్యర్థులకు కౌన్సెలింగ్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో గుర్తించిన పోస్టుల భర్తీకి కాంట్రాక్టు పద్ధతిన పనిచేయడానికి 2019 నవంబర్ 6న నిర్వహించిన రాతపరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 11న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఎంఐఎస్ కో–ఆర్డినేటర్, డాటాఎంట్రీ ఆపరేటర్లు, సిస్టమ్ ఎనాలిస్టు, అసిస్టెంట్ ప్రోగామర్ పోస్టులు భర్తీకి తుది జాబితాను సోమవారం డీఈవో కార్యాలయం నోటీసు బోర్డుపై ప్రదర్శించినట్లు తలెఇపారు. ఈ నెల 11న ఉదయం 11గంటలకు డీఈవో కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

కిక్ బాక్సింగ్‌లో యువకుడి సత్తా


రజత పతకం అందుకుంటున్న సంజీవ్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చంద్రవెల్లి గ్రామానికి చెందిన రాసకొండ సంజీవ్ జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటాడు. ఈ నెల 1 నుంచి 5వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో వాకో ఇండియా ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి సీనియర్స్, మాస్టర్స్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్నాడు. 67 కిలోల విభాగం పోటీల్లో సత్తా చాటి రజత పతకాన్ని అందుకున్నాడు. జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమగా రాణించిన సంజీవ్‌ను తెలంగాణ కిక్ బాక్సింగ్ క్రీడాకారులు, గ్రామస్తులు అభినందించారు.

లంపీస్కిన్‌తో లేగదూడ మృతి


మృతి చెందిన లేగదూడ

భీమారం(చెన్నూర్): మండలంలోని పోతన్పల్లిలో ఎడ్ల నారాయణకు చెందిన లేగదూడ సోమవారం లంపీస్కిన్‌తో మృతి చెందింది. కొన్ని రోజులుగా లేగదూడ చర్మంపై ఉండలుగా ఏర్పడిందని చికిత్స చేయించినా వ్యాధి నయంకాలేదని బాధిత రైతు వాపోయాడు. గ్రామంలో ఇప్పటికే మూడు పశువులు లంపీస్కిన్‌తో మృతి చెందాయని, మళ్లీ లేగదూడ మృతి చెందడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పశువైద్యాధికారులు స్పందించి గ్రామాల్లోని పశువులకు వ్యాధులు సోకకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై మండల పశువైద్యాధికారి రాకేశ్‌శర్మను సంప్రదించగా పోతన్పల్లిలో లేగదూడ లంపీస్కిన్‌తోనే మృతి చెందిందని నిర్ధారించారు. గతేడాది లంపీస్కిన్ వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు వేశామని, అయితే మూడు నెలల దూడలు మాత్రం మృతి చెందుతున్నాయని, వాటికి టీకాలు వేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి


రాయమల్లు (ఫైల్)

మందమర్రిరూరల్: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని యాపల్ ప్రాంతానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ రాయమల్లు (36) ఆదివారం రాత్రి స్థానిక బుర్దగూడెం సమీపంలోని హీరో హోండా షోరూం వద్ద నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా కుటుంబ కలహాలతో మృతుడు సుమారు 12 ఏళ్లుగా భార్యకు దూరంగా ఉంటున్నట్లు సమాచారం. ఇంటి నుంచి ప్రమాదం జరిగిన చోటుకి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడి వరకు నడుచుకుంటూ వెళ్లడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కవితను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు


కవితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాజిరెడ్డి

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్ రెడ్డి సోమవారం యూనియన్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితను జగిత్యాలలో కలిశారు. కారుణ్య ఉద్యోగాల్లో డిపెండెంట్ల వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచాలని, డిస్మిస్ కార్మికులకు మరో అవకాశం ఇచ్చేలా సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన దిలీప్ ఈ నెల 8న వ్యాపారంలో భాగంగా కరీంనగర్ నుంచి లక్సెట్టిపేటకు ఆర్టీసీ బస్సులో వస్తుండగా బ్యాగ్ బస్సులో మరిచి వెళ్లిపోయాడు. అందులో రూ. 2 లక్షల 70 వేలు ఉన్నాయని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి బస్సు దిగిన ప్రదేశాన్ని గమనించి ఇల్లంతకుంటకు చెందిన రాజు అదే బస్సులో ఉన్నాడని గమనించారు. అతన్ని విచారించగా తాను గుర్తించక తీసుకు వెళ్లానని చెప్పి డబ్బులను అప్పజెప్పినట్లు తెలిపారు.